



ఎన్‌జీఓ కాలనీలో...

కడప నగరంలోని గురుకుల్ విద్యాపీఠ్ వెనుక నిలిచిన నీరు

సంజన్న సర్కిల్‌లో నిలిచిన వాననీరు

నగరంలో రోడ్లు జలమయం

కడప కార్పొరేషన్: కొన్ని రోజులుగా జిల్లాలో వేసవి కాలం తరహాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండవేడిమికి, ఉక్కపోతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కాగా గురువారం రాత్రి నుంచి కాస్త భిన్నమైన వాతావరణం కనిపించింది. రాత్రి వేళ కొన్ని ప్రాంతాల్లో వర్షం పడగా, శుక్రవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై మధ్యాహ్నం నుంచి జల్లులు ప్రారంభమయ్యాయి. రాత్రి వరకూ తుంపరగా కొద్ది సేపు పడి జడివానగా మారింది. వర్షం వల్ల కడప నగరంలోని అప్సర కూడలి, సంజన్న సర్కిల్, వినాయక నగర్ సర్కిల్, ఎన్‌జీవో కాలనీ, గురుకుల్ విద్యాపీఠ్ వెనుక, ఆర్టీసీ ఔట్‌గేట్ తదితర ప్రాంతాల్లో రహదారులపై డ్రైనేజీ నీరు పొంగిపొర్లింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచింది.

క్లుప్తంగా

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలని కోరుతూ సెప్టెంబర్ 1 నుండి 6 వరకు సీపీఐ చేపడుతున్న దేశవ్యాప్త ఆందోళన జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయన్నారు. బియ్యం, పప్పులు, చింతపండు వంటి నిత్యావసర వస్తువులతోపాటు కూరగాయల ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే ధరలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి, రామయ్య, ఎల్. నాగ సుబ్బారెడ్డి, వెంకట శివ, వీరశేఖర్, చంద్రశేఖర్ వేణుగోపాల్, బాదుల్లా పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలను చెల్లించాలి

కడప రూరల్ : ప్రభుత్వ వసతి గృహాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలను చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న తెలిపారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా అధికారి భరత్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు సంబంధించిన మెస్, కాస్మోటిక్ బిల్లులు నెలల తరబడి రాలేదన్నారు. అలాగే హాస్టళ్లకు రెగ్యులర్ అధికారులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో స్వరూప్‌తేజ, వంశీరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులను తొలగించాలని చూడడం సరికాదు



జేడీ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న ఆర్‌సీపీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మార్కెట్ యార్డులో నూతన టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కడప మార్కెట్ యార్డ్ లో 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న స్వీపర్లను కొనసాగించాలని కోరుతూ జేడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ నష్టాల్లో ఉన్న కారణంగా 23 ఏళ్లుగా యార్డ్ లో స్వీపర్ గా పనిచేస్తున్న 11 మంది కార్మికులను తొలగించాలని చూడటం సరికాదన్నారు. మార్కెట్ యార్డ్ ఆదాయం పెంపు కోసం సంబంధిత అధికారులు పునరాలోచించాలే గాని దీనినే నమ్ముకున్న కార్మికుల ఉపాధిపై వేటు వేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సిపి నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్, తస్లీమ్, చాపల సుబ్బరాయుడు, విజయ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, యార్డ్ కార్యదర్శి నాగయ్య, సభ్యులు గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట



ప్రకాశ్‌నగర్‌లో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఎంఓ మనోరమ

కడప రూరల్ : ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చని జిల్లా మలేరియా నివారణ అధికారి మనోరమ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రకాశ్‌నగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మలేరియా, డెంగీ జ్వరాలను అరికట్టవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. వారానికి ఒకసారి తొట్లు, కుండలు, కూలర్లను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మి రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారులు బాల పుల్లయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీసీని తొలగించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వైవీయూను టీడీపీ ప్రభుత్వం రాజకీయాలకు వాడుకుంటున్నదని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని వైవీయూ ఇన్‌చార్జి వీసీగా నియమించడం తగదన్నారు. తక్షణమే వైవీయూ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డిని తొలగించి రెగ్యులర్ వీసీని నియమించాలని వారు కోరారు.

సీపీఆర్ పద్ధతి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి



విద్యార్థి చేత సీపీఆర్ చేయిస్తున్న రిమ్స్ వైద్యులు

కడప ఎడ్యుకేషన్: మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సీపీఆర్ పద్ధతిని నేర్చుకుని ఉండాలని గవర్నమెంట్ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం కడప నగర శివార్లలోని స్పిరిట్ కాలేజిలో సీపీఆర్ పద్ధతిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ, డాక్టర్ చిరువెల్లా సునీల్‌లు గుండె ఆగిపోయినప్పుడు ఆ వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేసి ప్రాణాలను ఎలా కాపాడవచ్చనే అంశంపై అవగాహన కల్పించారు. రిమ్స్ మెడికల్ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్, అనస్తటిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం గుండె ఆగిన 3 నుంచి 5 నిమిషాల వ్యవధిలో గుర్తించి వారికి సీపీఆర్ చేస్తే తిరిగి గుండె పనిచేస్తుందన్నారు. అనంతరం ప్రాక్టికల్‌గా మాణిక్విన్ మీద డిమాంస్ట్రేషన్ చేసి విద్యార్థులకు నేర్పించారు. ఈ కార్యక్రమంలో కాలేజి సంచాలకులు రవీంద్ర, ఉపాధ్యక్షులు శ్రీకాంత్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలలో పొరపాట్లు జరగకూడదు

– నగరపాలక కమిషనర్ వైఓ నందన్



అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వైఓ నందన్

కడప కార్పొరేషన్: గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా నగరపాలక అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో గణేష్ విగ్రహాలు ఎక్కడెక్కడ ప్రతిష్టిస్తున్నారనే వివరాలను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సేకరించాలన్నారు. నిబంధనల ప్రకారం మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు పోలీస్, ఫైర్, కార్పొరేషన్ వారి అనుమతులు తప్పక తీసుకోవాలని, లేనిపక్షంలో నోటీసులు ఇవ్వాలన్నారు. పెద్ద విగ్రహాలు పెట్టి మండపాలను నిర్మించేవారు రోడ్డు, మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లను పగులగొడితే వాటిని మళ్లీ మరమ్మతులు చేయించేందుకు తగిన రుసుం చెల్లించాలన్నారు. గణేష్ ఉత్సవాలకు రెండు రోజులు ముందుగానే శానిటేషన్ అధికారులు అన్ని ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఎక్కడైనా అన్నదానం, ప్రసాద వ్యర్థాలను డబ్బాల ద్వారా కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. ప్రతి విగ్రహం వద్ద అధికారులకు విధులు అప్పగించాలన్నారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ఫాగింగ్, బ్లీచింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి కేటాయించిన స్థలాల వద్ద అధికారులకు విధులు కేటాయించాలన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనానికి రూట్ మ్యాప్ మీదుగా వారికి కేటాయించిన ప్రాంతంలోనే నిమజ్జనం జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాతకడప చెరువు, కేసీ కెనాల్ వద్ద తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, నిమజ్జన మార్గంలో కరెంటు తీగలు, కేబుల్ వైర్లు అడ్డురాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో మొబైల్ టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కే రాకేష్ చంద్రన్, డిప్యూటీ కమిషనర్ పి. శ్రీనివాస్ రావు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధనలక్ష్మి, మేనేజర్ వెంకటరామిరెడ్డి, సచివాలయ విభాగం సూపరింటెండెంట్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సకల మానవాళికి తల్లి మరియమాత



విశేష అలంకారంలో ఆరోగ్యమాత స్వరూపం



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు



మరియ తల్లి గొప్పదనాన్ని వివరిస్తున్న గురువులు

కడప కల్చరల్ : మరియమాత సకల మానవాళికి తల్లిలా ప్రేమ కురిపించి ఆదరిస్తుందని కడప కతోలిక మేత్రాసన కోశాధికారి సంబటూరు సురేష్, బాకీ రవీంద్ర అన్నారు. శుక్రవారం ఆరోగ్యమాత ఉత్సవాలు కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా సంబటూరు సురేష్ దివ్యబలి పూజ సమర్పించారు. బాకీ రవీంద్ర మరియతల్లి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళిని లోకానికి పరిచయం చేసేది వారి తల్లి అయితే దీవెనలు, వరాలను అందించేది మరియతల్లి అని పేర్కొన్నారు. సంతాన ప్రదాతగా ఆమె మహిమ గల తల్లి అని, ఆమెను ఆరాధించి ప్రార్థించి సకల ఐశ్వర్యం, ఆరోగ్యాలను పొందాలన్నారు. రెండవ రోజు పూజ ప్రారంభంలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై మరియ తల్లి స్వరూపాన్ని భక్తిశ్రద్ధలతో చర్చి ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, వికర్ జనరల్ ఫాదర్ బాలరాజు, ఫాదర్ విజయరావు, మరియాపురం, మాసాపేట, డాన్ బోస్కో, పాస్టరల్ సెంటర్, గురువులు, ఆరోగ్యమాత, జేయంజె, క్రీస్తు జ్యోతి సిస్టర్లు, సహాయ డైరెక్టర్ పిల్లి మహేష్, ఆరోగ్యమాత మదర్ జనరల్ సుపీరియర్ మదర్ సెల్వి రాయప్పన్, చర్చి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, రాజన్, సభ్యులు, రాజేంద్ర కుమార్, రాజ్ కుమార్, ఏంజెలినా, శ్యామలమ్మ, హరి ప్రసాద్, మెథ్యు అశోక్, విక్టర్, జయరాజు, యూత్ కమిటీ సభ్యులు, విన్సెంట్ ది పాల్ సంఘం, మరియదళం సంఘం, మౌలిక సంఘం, శాంతి సేవా సొసైటీ సభ్యులు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐసీడీఎస్ పరిధిలోని మిషన్ వాత్సల్య పథకంలో పనిచేసేందుకు ఆయా, సోషియల్ వర్కర్ పోస్టులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో పాటు కమిటీ సభ్యులైన ఐసీడీఎస్ పీడీ, సాంఘిక సంక్షేమశాఖ జేడీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్, జువైలిన్ జస్టిస్ బోర్డు మెంబర్, డీసీపీఓలు హాజరైన అభ్యర్థుల అర్హతలు, అనుభవానికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అన్ని విధాల అర్హులై ప్రతిభ గల అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

ఎన్‌సీసీతో ఆత్మవిశ్వాసం



ఎంపికైన విద్యార్థులతో ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్, సిబ్బంది

బద్వేలు అర్బన్ : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, ధైర్య సాహసాలు పెంపొందుతాయని నెల్లూరు ఎన్‌సీసీ–10 (ఎ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ గణేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎన్‌సీసీ నేవీ విభాగానికి విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఫిజికల్, మెడికల్ పరీక్షల ఆధారంగా 32 మంది విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవతో పాటు దేశ సేవ చేయాలనుకునే వారికి ఎన్‌సీసీ విభాగం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాచపూడి వెంకటసాయికృష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులు, కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓ లెఫ్టినెంట్ బాలఓబులేసు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ పాఠశాలలకు సర్దుబాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న హై స్కూల్ ప్లస్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ చేసి ఉండటం వలన సబ్జెక్టు బోధన నిలిచిపోయే పరిస్థితి హైస్కూల్ ప్లస్ పాఠశాలలకు ఉందని, వెంటనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని అన్నారు. హై స్కూల్ ప్లస్ పాఠశాలలకు మాత్రమే ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయడం శోచనీయమని అన్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగితే సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేయాలి తప్ప, రకరకాల కారణాలు చూపి నిలిపివేయడం సమంజసం కాదన్నారు. బద్వేల్ హై స్కూల్ ప్లస్‌లో ఐదు మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందారని, అదేవిధంగా ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం కంటే విద్యార్థుల సంఖ్య పెరగడమే కాక ముగ్గురు ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారన్నారు. ఆ స్థానాల్లో ఉపాధ్యాయులను భర్తీ చేయక, పదోన్నతులు ఇవ్వక, ఉపాధ్యాయులను సర్దుబాటు చేయకపోవడంతో సబ్జెక్టు బోధన కుంటుపడుతుందని అన్నారు.

ఇది ఈ పాఠశాలలకే కాదని జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలలు ఉన్నాయన్నారు. ఉన్న ఉపాధ్యాయులు 8 పీరియడ్స్ బోధించినా ఇంకా కొన్ని క్లాసులు మిగులుగా ఉన్నాయన్నారు. కావున హైస్కూల్ ప్లస్ పాఠశాలలకు కూడా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

కడప అర్బన్: కడప రైల్వే స్టేషన్ సమీపంలో గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని కడప వన్ టౌన్ ఇన్‌ఛార్జ్ సీఐ ఏ.పి మస్తాన్ వల్లీ, ఎస్ఐ జీ. అమర్‌నాథరెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం అరెస్ట్ చేశారు. జగదీష్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు. అరెస్టయిన ముగ్గురి నుంచి ఒక కిలో 180 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు.

అమ్మవారికి బంగారు చీర



పోరుమామిళ్ల : పట్టణంలోని అమ్మవారిశాలలో శుక్రవారం శ్రావణమాసంలో చివరి శుక్రవారం కావడంతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి మూలవిరాట్‌ను బంగారుచీరతో అలంకరించారు. 108 చీరలతో అమ్మవారికి అష్టోత్తర కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం గుడి ఉత్సవం అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విశ్వనాథుల ప్రసాద్, మహిళా మండలి అధ్యక్షురాలు పలుకూరి రాధ, యువజన సంఘం అధ్యక్షుడు శేఖర్, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



గేట్ మీటింగ్‌లో పాల్గొన్న ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు, కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించి వారికి తగిన న్యాయం చేయాలని ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ నాయకులు, కార్మికులు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ పీటీడీ ఉద్యోగులకు జీఓ నెంబరు 114 మేరకు, టీఆర్ అండ్‌బీ సెక్రటరీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని పలుమార్లు విన్నవించిన ఫలితంగా నైట్ అలవెన్సులను రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్లు, కండక్టర్లకు అమలు చేశారన్నారు. 58 డిపోల్లో అమలు చేయని అంశాన్ని గురించి గత నెల 23న వినతిపత్రాన్ని ఇవ్వగా పెండింగ్‌లో ఉన్న ఆయా యూనిట్లలో కూడా అమలు చేసేందుకు సంబంధిత ట్రెజరీ అధికారులకు ఆదేశాలు ఇచ్చి అమలు చేయిస్తామని కూడా చెప్పారన్నారు. కానీ అందుకు భిన్నంగా ఏపీ పీటీడీ ఉద్యోగులకు ఈనెల వేతనాలలో నైట్ అలవెన్సులు కలపవద్దని ఆదేశాలు రావడంతో ఈనెల జీతాలలో కలపకుండా ఆపివేశారని తెలిసిందన్నారు. ఏపీ పీటీడీ ఉద్యోగులకు ఈనెల నుంచి నిలిపి వేసిన నైట్ అవుట్ అలవెన్సును పునరుద్ధరించి అరియర్స్ బిల్లులు, సిక్ లీవుల బిల్లులు, రిటైర్డ్ ఉద్యోగుల సెటిల్‌మెంట్స్, ఏఏఎస్‌ల అరియర్స్, ఇతరత్రా అరియర్స్ బిల్లులు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూరెళ్ల, దత్తాత్రేయశర్మలకు 'జానమద్ది' సాహితీ పురస్కారం

కడప కల్చరల్ : ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, గండ్లూరి దత్తాత్రేయశర్మలు 2024 సంవత్సరానికిగాను డాక్టర్ జానమద్ది సాహితీపీఠం పురస్కారాలకు ఎంపికయ్యారు. బ్రౌన్ గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి పేరిట ఏర్పాటు చేసిన జానమద్ది సాహితీ పీఠం పక్షాన కర్నూలుకు చెందిన ప్రముఖ కవి, అవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మకు, తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లాకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు గ్రంథాలయ సేవలకుగాను ఈ అవార్డులు అందజేయనున్నారు. ఈ విషయాన్ని జానమద్ది సాహితీ పీఠం గౌరవ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, మండలి బుద్ధప్రసాద్, పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. కడపలోని బ్రౌన్ గ్రంథాలయంలో అక్టోబరు 20వ తేదీ ఆదివారం నిర్వహించనున్న సభలో ఈ పురస్కారాలను వారికి అందజేస్తామని తెలిపారు. రూ. 10 వేల నగదు, శాలువ, జ్ఞాపికతో వారిని సత్కరిస్తామన్నారు. ఈ సభకు పలువురు సాహితీవేత్తలు, అధికారులు హాజరవుతారన్నారు.

డాక్టరేట్ ప్రదానం



కె. నాగరాజు

వైవీయూ: యోగివేమన విశ్వ విద్యాలయం తెలుగు శాఖ పరిశోధకుడు కె. నాగరాజుకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య జి. పార్వతి పర్యవేక్షణలో 'రెండు దశాబ్దాల రాయలసీమ కథలు – విద్యావ్యవస్థ ప్రతిఫలనం (1991 నుండి 2010 వరకు)' అనే అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య ఈశ్వరరెడ్డి తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



సి. భాస్కర్‌రెడ్డి

కడప అర్బన్: కడపలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సీఐ–1గా సి. భాస్కర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన ఎస్ఐగా, సీఐగా జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో విధులను నిర్వహించారు. ఇటీవల జరిగిన బదిలీలలో ఈయనను కడప వన్‌టౌన్ నుంచి సీసీఎస్–1గా నియమించారు. అలాగే కడప వన్‌టౌన్ సీఐగా ఏ.పి. మస్తాన్‌వల్లి బాధ్యతలను స్వీకరించారు.

వైవీయూ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ సందర్శన



వైవీయూలోని ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయ ఫైన్‌ఆర్ట్స్ శాఖ ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను కడప నగరంలోని ఢిల్లీ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఆర్ట్ గ్యాలరీలో శిల్పకళ, చిత్రకళ, ప్రింట్ మేకింగ్, డిజైన్లను విద్యార్థులు తిలకించారు. ఈ సందర్భంగా ఫైన్‌ఆర్ట్స్ శాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు విద్యార్థులకు కళల గురించి పరిచయం చేశారు. చిత్రకళ శిల్పకళ భవిష్యత్తు అవకాశాలు గురించి అవగాహన కల్పించారు. ఈ రంగం సృజనాత్మకమైందని, మానసిక ప్రశాంతతనిస్తుందని వివరించాను. సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఆర్ట్స్ ఎగ్జిబిషన్ ఉంటుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ శాఖ అధ్యాపకులు సిహెచ్ వెంకటేష్, చిన్న రాయుడు, బి. ఈరప్ప, డా. రెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

కడప కార్పొరేషన్: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్–2 వార్డెన్ రామకృష్ణారెడ్డిపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి, యువజన సంఘం (పిఆర్ఎస్ వైఎఫ్) డిమాండ్ చేసింది. శుక్రవారం ఆ సంఘం నాయకులు కడప కలెక్టరేట్ కార్యాలయంలో పరిపాలన అధికారి విజయ్ కుమార్‌కు ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు మాట్లాడుతూ....ప్రొద్దుటూరు పట్టణంలోని ఎస్సీ హాస్టల్ -2 లో 30 మంది విద్యార్థులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు వార్డెన్ ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదన్నారు. హాస్టల్ లో గదులు పరిశుభ్రంగా లేవని, కిటికీలకు మెస్‌లు లేవన్నారు. తద్వారా దోమలు వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ నగర నాయకులు విష్ణు, తరుణ్, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.